

సర్వే ఏడీగా గౌస్ బాష



సర్వే ఏడీకి స్వాగతం పలుకుతున్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బదిలీపై చిత్తూరు జిల్లా సర్వే ఏడిగా నియమితులైన గౌస్‌బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సర్వే ఏడిని గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగస్తుల సంఘం జిల్లా అధ్యక్షులు అలీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మామి(దోపి)డి



- రైతుల ఆశలపై నీళ్లు..
- దక్కని మద్దతు ధర..
- కలెక్టర్ ఆదేశాలు భేఖాతర్
- ర్యాంపుల్లో యజమానుల ఇష్టానుసారం కొనుగోలు



మామిడి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

మామిడి రైతులను ఆదుకుంటాం.. కనీస మద్దతు ధర ఇస్తాం.. ఇదీ అధికారులు చెబుతున్న మాటలు. అయితే క్షేత్రస్థాయిలో సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ప్రకటించిన ధరను సైతం ఇవ్వకపోవడం గమనార్హం. వర్షాలు, కోత సమయం రావడంతో ఇదే అదునుగా రైతులను పలు యాజమాన్యాలు నిలువునా దోచుకుంటున్నాయి.

జిల్లా కలెక్టర్ తోతాపురి రకానికి టన్నుకు రూ.19వేలు మద్దతు ధరను ప్రకటించారు. మార్కెట్ యార్డుల్లో టన్ను రూ.11 నుంచి 12 వేలకు మించి పండ్ల గుజ్జు పరిశ్రమల యజమానులు కొనుగోలు చేయడం లేదు. రైతులంటే ఎంత లెక్కలేని తనమంటే కనీసం మార్కెట్ యార్డుల వద్ద మామిడి మద్దతు ధర ఎంత నిర్ణయించారన్న విషయాన్ని తెలిసేలా నోటీసు బోర్డులు కూడా పెట్టలేదు. ప్రధాన మామిడి మార్కెట్ యార్డులైన బంగారుపాళ్యం, చిత్తూరు, దామలచెరువు మార్కెట్ యార్డులో ధరల పట్టికలు లేవు. గుజ్జు పరిశ్రమల యజమాన్యలతో చర్చించి ధర నిర్ణయిస్తే క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. రైతులను నిలువునా దోపిడీ చేసేలా పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.11వేలకు మించి ఇవ్వడం లేదని మామిడి రైతులు గగ్గోలుపెడుతున్నారు. కనీసం సాగు ఖర్చులు కూడా రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట దిగుబడి తగ్గించి, ఈ ఏడాది మంచి రేటు వస్తుందనుకుంటే కాయల నాణ్యత పేరుతో ధరలు తగ్గించి మామిడి రైతుల నోట్లో మట్టికొడుతున్నారని మామిడి రైతులు గుజ్జు పరిశ్రమల యాజమాన్యాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మార్కెట్ యార్డులో మామిడి రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇచ్చేంధే పుచ్చుకోవాల్సి వస్తోంది. సీజన్ మొదట్లో టన్నుకు రూ.19 వేలు ప్రకటించారు. అమలు అంతంత మాత్రమే. ప్రతి పదిరోజులకు ఒకసారి పరిస్థితిని బట్టి ధరలు నిర్ణయిస్తామని ప్రకటించినా దాదాపు 20రోజుల తరువాత జిల్లా కలెక్టర్ మంగళవారం తోతాపురి రకం టన్నుకు రూ.15.50లు ప్రకటించారు. జూన్ మొదటి వారం నుంచి కోతలు పెరిగాయి. మార్కెట్ యార్డులకు కాయలు వస్తున్న తరుణంతో ధర తగ్గించడంపై మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర రూ.20 నుండీ 25వేలు ప్రకటిస్తే తప్ప గిట్టుబాటు కాదని రైతులు సంఘాల నేతలు చెబుతున్నారు.

ఏటా ఇదే పరిస్థితి ఈ ఏడాది పంట దిగుబడి 20శాతం మించలేదు. మంచి ధరల పలుకుతుందనే ఆశలు పెట్టుకున్న మామిడి రైతులకు జిల్లా కలెక్టర్ ప్రకటించిన తోతాపూరి రకం టన్నుకు రూ.19వేలు రైతు ఆశలపై నీళు ్ళచల్లిన్నట్లైయింది. చిత్తూరు జిల్లా మామిడికి ప్రసిద్ధి ఇక్కడి మామిడి రకాలు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చిత్తూరు మామిడికి ఇతర ప్రాంతాల్లో మంచి గిరాఖీ ఉంటోంది. జిల్లాలో 54,370 హెక్టార్లలో (1,36000 ఎకరాలో) 68వేల మంది రైతులు మామిడి సాగుచేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పంట దిగుబడి 20శాతానికి మించలేదు. ఇక పండ్ల గుజ్జు పరిశ్రమల విషయానికొస్తే చిత్తూరు జిల్లాలో 31 పండ్ల గుజ్జు పరిశ్రమలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 39 పరిశ్రమలున్నాయి. ఈలెక్కన చిత్తూరు జిల్లాలోని 31 పండ్ల గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇందులో జైన్, గల్లా, ఫుడ్ ఇన్‌నీడ్స్ వంటి దిగ్గజ సంస్థలు చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి. ఏటా పండ్ల గుజ్జు పరిశ్రమలు సిండికేట్ కావడం మామిడి ధర పెగకుండా అదుపు చేస్తున్నారనే ఆరోపనులున్నాయి.

రైతు సంఘాల నేతలు ప్రత్యక్షంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకొనే పరిస్థితి లేదు. మరోవైపు రాంపులు (తూకం) గుజ్జుపరిశ్రమల వద్ద రైతులను మోసగిస్తున్నారు. మే 20 తేది నుండీ మామిడి కోతలు ప్రారంభయ్యాయి. దాదాపు 60రోజుల పాటు అంటే జూన్ నెల చివరి వరకు మామిడి సీజన్ ఉంటుంది. ఈ ఏడాది మామిడి సీజన్ ప్రారంభానికి ముందే జిల్లా కలెక్టర్ గుజ్జుపరిశ్రమల యజమాన్యాలతో సమావేశం నిర్వహించడం. ప్రతి పదిరోజులకో మారు పరిస్థితులను బట్టి ధర నిర్ణయిస్తామని ప్రకటించడంతో మామిడి రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రకటించిన ధరలు ఇవ్వకపోవడం, ధరలు పెరుగుతాయని భావిస్తే కోతలు పెరిగిన సమయంలో టన్ను రూ.15.50లు తగ్గించడంతో ఖర్చులు కూడా రావడం లేని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

జిల్లా మామిడి రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి

ఎస్‌ఆర్ పురం: మామిడి రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా మామిడి రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49కొత్తపల్లి మిట్టలో ఉన్న ఎనిమిది మామిడి కొనుగోలు రాంపులలో కొనుగోలుదారులు రైతుల వద్ద అతి తక్కువ ధరకే (రూ.8 నుంచి 9లు) కొనుగోలు చేస్తున్నారని సమాచారంతో జిల్లా మామిడి రైతుల సంఘం నాయకులు రైతులతోకలిసి రాంపులవద్ద చేరుకున్నారు. కొనుగోలుదారులను కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీకి రూ.15.50లకు తగ్గకుండా తీసుకోవాలన్నారు. రాష్ట్ర గాండ్ల సంఘం డైరెక్టర్, మాజీ ఎంపీపీ పురుషోత్తం, మండల అధ్యక్షులు ఉమాచందర్‌రెడ్డి, నాగరాజురెడ్డి, సురేంద్రరెడ్డి, త్యాగరాజులు పాల్గొన్నారు.



మామిడి మద్దతు ధర రూ.15.50లు

నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు: కలెక్టర్



మామిడి మద్దతు ధరపై సమావేశంలో రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడతున్న కలెక్టర్

చిత్తూరు అర్బన్: మామిడి పంటకు మద్దతు ధర విషయంలో రైతులు, కొనుగోలుదారులు ఇద్దరికీ మధ్యస్తంగా ఉండేందుకు మామిడికి మద్దతు ధరను ప్రకటించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సంయుక్తంగా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి చెందినది అన్నారు. ఈ పంట పండించే రైతులకు ప్రభుత్వం మేలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మామిడి కోత ప్రారంభమవుతున్నందున రైతులకు వారు పెట్టిన పెట్టుబడికి తగిన ఫలితం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వర్షాలు కురవడం వలన మామిడి పంటకు సంబంధించిన రైతులు ఇబ్బందులు ఎదుర్కోవల్సిన పరిస్థితి వస్తోందన్నారు. మామిడి కాయలపైన నల్లని మచ్చలు రావడంతోపాటు గాలి,వానతో పంట రాలిపోవడం జరుగుతున్నట్లు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతాంగానికి న్యాయం చేయాలని మామిడి రైతులు కలెక్టర్‌ను కోరారు. జిల్లా యంత్రాంగం నిర్ణయించిన మద్దతు ధర మేరకు మామిడి పండ్లను కొనుగోలు చేశామని ప్రాసెసింగ్ యూనిట్ల యాజమాన్యం నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో మామిడి కోత ప్రారంభమవుతున్నదని ఈనేపథ్యంలో ఇప్పటికే కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం, తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నుండి మామిడి పండ్లు జిల్లాకు వస్తున్నాయని తెలిపారు. రైతులు ఒకేసారి పంట కోసి ప్రాసెసింగ్ యూనిట్ల వద్దకు తీసుకొని రావడం కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. రైతులు దశలవారీగా పక్వానికి వచ్చిన పంటను మాత్రమే కోసి ప్రాసెసింగ్ యూనిట్ల యాజమాన్యానికి సహకరించాలని కోరారు. రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో చర్చలు జరిపిన అనంతరం కలెక్టర్ మద్దతు ధరను ప్రకటించారు. నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు మద్దతు ధర రూ.15.50 పైసలు ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రకటించిన ఈమద్దతు ధరను అన్ని ఫ్యాక్టరీల్లో అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జూన్ 11వ తేదీ తరువాత తదుపరి సమావేశం నిర్వహించి మద్దతు ధరను మరోసారి ప్రకటిస్తామన్నారు. ఈమద్దతు ధరను రైతులు, కొనుగోలుదారుల సమక్షంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. వర్షాల వలన పంట రాలిపోతుందనే కారణంతో రైతులు తొందరపడి పంట మొత్తాన్నా కోయరాదన్నారు. పరిస్థితులను బట్టి పక్వానికి వచ్చిన పండ్లను మాత్రమే కోయాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో రైతులు సంయమనం పాటించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, పండ్ల పరిశ్రమ సమాఖ్య నాయకులు గోవర్ధన్ బాబీ, శివకుమార్, రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, రక్షణ కోసం

ప్రతి గడపకీ మహిళా పోలీస్: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా పోలీసులు ప్రతిష్టాత్మకంగా త్వరలో ప్రారంబించబోయే 'ప్రతీ గడపకి మహిళా పోలీస్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిత్తూరు పట్టణంలోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లాలోని సుమారు 500మంది మహిళా పోలీసులకు వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత, వారి రక్షణే ధ్యేయంగా త్వరలో మొదలుపెట్టే 'ప్రతీ గడపకి మహిళా పోలీస్' కార్యక్రమం విధివిధానాల గురించి, యాప్ గురించి దాని పని తీరు, ఎలా ఉపయోగించుకోవాలి అనే దానిపై వివరించడం జరిగిందని తెలిపారు. చిత్తూరు పోలీసులు రూపొందించిన యాప్‌లో పొందుపరిచి ఏదైనా సమస్యలు నమోదైతే దానిని పరిష్కరించే దిశగా అడుగులు వేయాలనే ఉద్దేశంతో మొదలుపెట్టిన ఈకార్యక్రమంలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎంతో ఉత్సాహంగా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్, జిల్లా పరిషత్ సిఇఓ ప్రభాకర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఎస్ఇబి శ్రీలక్ష్మీ, దిశ డిఎస్పీ జె.బాబుప్రసాద్, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ విష్ణు రఘువీర్, పట్టణ ఇన్స్పెక్టర్లు భాస్కర్, మద్దయ్యాచారి, దిశ ఇన్స్పెక్టర్ బాలయ్య, ఆర్ఐ అడ్మిన్ నీలకంటేశ్వర రెడ్డి, దిశా ఎస్ఐ నాగసుజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తను హత్య చేసిన

నిందితుడ్ని అరెస్టు చేయాలి

యూనియన్ జిల్లా కార్యదర్శి షకీల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తను అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితుడ్ని వెంటనే అరెస్టు చేసి, మృతురాలి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీల మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టు పరిధిలో రాయవరం గ్రామంలో విధినిర్వహణలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తను అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కొండలరావు ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేయడంపై నిందితుడ్ని వెంటనే అదుపులోకి తీసుకొని సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు పెరిగాయని రాజకీయ కక్షలతో అంగన్వాడీలను వేధింపులకు గురి చేస్తే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా జనవిజ్ఞానవేదిక పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో రీసైక్లింగ్ వ్యక్తిగత బాధ్యత అనే అంశంపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పర్యావరణం కాలుష్య ప్లాస్టిక్ కేవలం 10శాతం మాత్రమేనని రీసైక్లింగ్ కాపాడుతోందన్నారు. ప్లాస్టిక్ పారవేయడం వల్ల నేల, నీరు, కాలుష్యం ఎక్కువై మానవాళికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పర్యావరణ సమస్య ఇందుకోసం 2023లో బీట్ ద ప్లాస్టిక్ నినాదంతో ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిలింగ్ చేయాలంటూ ఐరాస ప్రకటించిందని జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఈ సమావేశంలో సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల నేల, నీరు కాలుష్యం ఎక్కువగా జరుగుతోందని కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సముద్రాల్లో నదుల్లో జీవవైవిధ్యం దెబ్బతినడానికి ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడపడితే అక్కడ పడవేయడమే కారణమని దీనివల్ల పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. విజయం కళాశాల సీనియర్ అధ్యాపకులు రమణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి ప్లాస్టిక్ను రీసైక్లింగ్ చేయడానికి ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. విద్యార్థులచే ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం నా బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించాలన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన

పురుషోత్తం నాయుడ్ని వెంటనే అరెస్టు చేయాలి

బాధితులతో పోలీసుస్టేషన్ వద్ద సిపిఎం ధర్నా




పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

ప్రజాశక్తి- పూతలపట్టు

మండలంలోని వడ్డేపల్లికి చెందిన పురుషోత్తం నాయుడు 20 మంది పేదలకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి రూ.40లక్షలు వసూళు చేసి మోసం చేశాడని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్ అన్నారు. మంగళవారం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిన పురుషోత్తం నాయుడ్ని వెంటనే అరెస్టుచేయాలని సిపిఎం ఆధ్వర్యంలో పూతలపట్టు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు, సురేంద్రన్, మండల కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ గత నాలుగేళ్ల ముందు చిన్నకలికిరి పల్లెకు చెందిన కూలీల వద్ద పురుషోత్తం నాయడు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి లక్షల రూపాయలు వసూలు చేశాడని తెలిపారు. అప్పటినుంచి ఉద్యోగాలు ఇవ్వకపోగా, పేదలు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతూ చివరికి బెదిరింపు చర్యలు పాల్పడుతున్నాడని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో ఉద్యోగులు తీసిస్తానని మోసం చేస్తున్న అతనిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరకాలంగా మోసం చేసిన అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న పట్టించుకోకపోవడంతో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు ధర్నా చేయడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు కూడా తన పేరును ఉపయోగించి మోసం చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కూడా కేసు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ధర్నా చేయాల్సి వస్తున్నదని తెలిపారు. పేదలంటే లెక్క లేకుండా వ్యవహరిస్తున్న వారిపై పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ అప్పు చేసి లక్షల రూపాయలు ఇచ్చిన వాటికి వడ్డీ కట్టలేక కొద్దిపాటి ఆస్తిని కూడా అమ్ముకోవడం జరిగిందన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలు శరణమంటూ మీడియా ముందు వాపోయారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా ఖజానా అధికారుల తీరు దారుణం

డీఈవోకు ఫ్యాప్టో నేతల ఫిర్యాదు



ఖజానా అధికారుల తీరుపై డిఇఒకు ఫిర్యాదుచేస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఖజానాశాఖ అధికారి తన దగ్గరకు వివిధ సమస్యలపై కలసేందుకు వచ్చే ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఫ్యాప్టో నాయకులు డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓ రాజశేఖర్‌ను కలిసి తమ ఫిర్యాదును అందజేశారు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై తాము ప్రాతినిధ్యం చేయడానికి వెళ్ళినప్పుడు, సమస్యలను పట్టించుకోకుండా వెటకారపు మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయన తీరు మారకపోతే తాము ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా చీలాపల్లి సిఎంసి ఆసుపత్రిలో ఉద్యోగులకు హెల్త్‌కార్డులు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా మెడికల్ బోర్డులో మెడికల్ రీయంబర్స్మెంట్‌కు సంబంధించి అనవసరంగా కొర్రీలు వేసి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. జిల్లాలోని టీచర్లు అందరి సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాలను, సీనియార్టీ జాబితాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీచర్ పోస్టులు బ్లాక్ చేయడం వల్ల బదిలీ కౌన్సిలింగ్‌లో సీనియర్ టీచర్లకు తీవ్ర-నష్టం జరుగుతున్నదని తెలిపారు. అన్ని శాఖలలోని ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల గురించి చర్చించడానికి వీలైనంత త్వరగా సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

అద్దె బకాయిదారులకు నోటీసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మున్సిపల్ దుకాణాలకు దీర్ఘకాలికంగా చెల్లించాల్సిన అద్దెను సత్వరం చెల్లించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్పష్టం చేశారు. మంగళవారం ఏఎస్ఎం మున్సిపల్ కాంప్లెక్స్‌లోని పలు దుకాణాలను కమిషనర్ తనిఖీ చేశారు. దీర్ఘకాలికంగా అద్దెబకాయిలు ఉన్న దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. సత్వరం అద్దె బకాయిలను చెల్లించాలన్నారు. మూసి ఉన్న దుకాణాలకు సంబంధించి నోటీసులను సదరు దుకాణాలకు అంటించారు. బకాయిలను వారం రోజుల లోపల చెల్లించాలన్నారు. బకాయిలు చెల్లించని దుకాణాలను స్వాధీనం చేసుకుని, చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన ఏఎస్ఎం, ఎంఎస్ఆర్, కస్తూరిబా, జైహింద్, గుర్రప్ప నాయుడు, కొంగారెడ్డిపల్లిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఎక్కువ కాలం అద్దె చెల్లించని వారికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. మొత్తం 94 దుకాణాలకు సంబంధించి వడ్డీ, జీఎస్టీతో సహా రూ.2.10కోట్ల మేరకు అద్దె బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ మొత్తాన్ని రాబట్టేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్వో గోపాలకష్ణ వర్మ, సీనియర్ అసిస్టెంట్స్ తనూజ, ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



అద్దె బకాయిదార్లను నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

సమన్వయంతో లక్ష్యాలను సాధించండి: జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్డు కార్యదర్శులు, సూపర్వైజర్ అధికారులు సమన్వయంతో పనిచేసి హౌసింగ్ లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న గహనిర్మాణాల పురోగతిపై మంగళవారం సాయంత్రం కమిషనర్ డాక్టర్ జె.అరుణ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్డీవో రేణుకలతో కలిసి వార్డు కార్యదర్శులు, సూపర్వైజర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్లనిర్మాణం చేపట్టిందని, వార్డు కార్యదర్శులు ఇళ్ల నిర్మాణంలో బాధ్యతాయుత పాత్ర పోషించాలన్నారు. జూలై 31వ తేదీ నాటికి నిర్దేశించుకున్న ఇళ్లను పూర్తిచేసేలా వార్డు కార్యదర్శులు పరస్పర సహకారంతో లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రస్తుతం మీరు కష్టపడి కట్టించే ఇల్లు మీ ఉద్యోగ జీవితంలో ఎంతో సంతప్తిని ఇస్తాయన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది.. ప్రస్తుతం బిఎల్, ఆర్‌ఎల్ స్టేజ్ లోని మిగిలిన గహాలను పూర్తి చేయించాలన్నారు. యాక్షన్ ప్లాన్ ఏంటి? ఎలా అమలు చేస్తున్నారు అని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యదర్శులు, అధికారులు కలిసికట్టుగా కషిచేసి ఇళ్ల నిర్మాణంలో చిత్తూరును మొదటిస్థానంలో నిలపాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్లనిర్మాణం వేగవంతం చేయడం కోసం తీసుకుంటున్న చర్యలను, కార్యాచరణ ప్రణాళికను నగర కమిషనర్ అరుణ వివరించారు. ఈకార్యక్రమంలో మెప్మా పీడీ రాధమ్మ, నగరపాలక, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల్లో అన్ని ఖాళీలు ప్రదర్శించాలి

ప్రభుత్వానికి ఫ్యాప్టో నేతల డిమాండ్



ఫ్యాప్టో నేతల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టీచర్ల బదిలీ కౌన్సిలింగ్లో అన్ని ఖాళీలను పారదర్శకంగా ప్రదర్శించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్జీవో భవనం నందు ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిరంజీవి మాట్లాడుతూ టీచర్ల బదిలీ ప్రక్రియ ఒక ప్రహసనంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు, సీనియర్ టీచర్లకు కూడా సరైన స్థానాలు లభించని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీలు బ్లాక్ చేయకుండా, అన్నీ ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. టీచర్లను భోధనకే పరిమితం చేయాలని, బోధనేతర పనులను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాఫ్టో ఆధ్వర్యంలో జరిగే దశలవారీ ఉద్యమాలను విజయవంతం చేయాలని కోరారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు మునాఫ్, రమేష్, దేవరాజులు రెడ్డి, రమణ, కిరణ్, నాధముని, రామ చంద్రయ్య, గంటా మోహన్, చెంగల్‌రాయ మందడి ఆంజనేయులు, మదన్‌మోహన్ రెడ్డి, కుమార్ యాదవ్, బాషా, దక్షిణామూర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో అక్రమ ఇసుక రవాణాను ప్రభుత్వ అధికారులు అరికట్టాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. మంగళవారం వారు టిడిపి పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని ననియాల, నారాయణపురం తాండా, సింగసముద్రం, పెద్దూరు తదితర అటవీ ప్రదేశాల్లో వైసిపి నాయకులు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి రూ.లక్షలు దోచుకుంటున్నారన్నారు. టిడిపి తరపున పలుమార్లు మీడియా, సమావేశాలు ఏర్పాటు చేసి ఉన్నతాధికారులకు తెలియజేసినా నామమాత్ర చర్యలతో ఒకటి, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని రూ.2 వేలు జరిమానా విధించి వదిలేస్తున్నారన్నారు. దీనికి తోడు అధికారుల కనుసన్నల్లోనే ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో కుప్పం పర్యటనకు విచ్చేయనున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు, కుప్పం నియోజకవర్గ శాసన సభ్యుడు చంద్రబాబు నాయుడు కూడా ఇసుక తరలింపు వ్యవహారంపై తెలియజేశామన్నారు. ఆయనను ఇసుక మాఫియా తరలిస్తున్న ప్రదేశాలకు తీసుకెళ్లి క్షుణ్ణంగా వివరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా ఫోటోలు, వీడియోలు పంపి ఇసుకాసురుల ఆటలు అరికడతామన్నారు. సమావేశంలో రామ్మూర్తి, కష్ణ నాయక్, మనోహర్, విశ్వనాథ్, వెంకటాచలం, చంద్రశేఖర్, గజేంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



అక్రమ సారా వ్యాపారాలకు స్వస్తి పలకండి

ప్రజాశక్తి-కార్వేటినగరం: అక్రమ సారా అమ్మకాలు, తయారీలకు స్వస్తి పలికి సమాజంలో గౌరవంగా జీవనం గడిపేందుకు సహకరించాలని డ్వామా పీడీ తులసి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరివర్తన 2.0 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి జీవితాలను గుల్ల చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం ఏఈఎస్ ఆయోష బేగం మాట్లాడుతూ సారా తయారీని కుటీర పరిశ్రమలుగా చేసుకుంటూ పోలీస్ కేసుల్లో చిక్కి, కోర్టు మెట్లు ఎక్కి ఆర్థికంగా వెనుకబడి పోతున్నారని, సారా తయారీని వీడి ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణాలను తీసుకుని పాడిఆవులు, దుఖాణాలు, వంటి వాటిపై పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మండలంలోని గోపిశెట్టిపల్లి, కొటార్వేడు, రాజులకండ్రి, ఎర్రమరాజుపల్లి, గాజంకి గ్రామాల నుంచి వచ్చిన 85 మంది సభ్యులు హాజరు కాగా అందులో 55 మంది పాడి ఆవులు, 8 మంది మేకలు, 11 మంది గొర్రెలు, ఇద్దరు కిరాణషాపు, 9 మంది ఇతర రుణాలు కావాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో స్పందించిన పీడీ వెంటనే సున్నావడ్డీ కింద ప్రభుత్వం అందించే రుణాలను సక్రమంగా చెల్లించుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఏసీడీ రవికుమార్, ఇండియన్ బ్యాంకు ఎల్డీఎం, ఇండియన్ బ్యాంకు మేనేజర్ మనోజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు, సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీడీవో మోహన మురళీ, ఏపీఎం విజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపీ ఆస్పత్రిపై ఆకస్మిక దాడి

ప్రజాశక్తి-కార్వేటినగరం: విచ్చలవిడిగా నిర్వహిస్తూ, పేదల జేబులకు చిల్లులు పడేలా వసూలు చేస్తున్న ఆర్ఎంపీ ఆస్పత్రిపై మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఎలాంటి విద్యార్హత లేకుండా పుట్టగొడుగుల్లా వెలిసిన ఆర్ఎంపీ వైద్యులపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొల్లాగుంట చెక్ పోస్టు వద్ద ఆర్ఎంపీ వైద్యులుగా చలామణి అవుతున్న మురళీని అదుపులోకి తీసుకుని అతను వాడుతున్న మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్హత డిగ్రీ, ఎంచుకున్న వత్తి డాక్టర్. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా దొరకనటువంటి మందులు కూడా ఆర్ఎంపీల వద్ద ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తేలికపాటి వ్యాధులకు హై డోస్ మందులు వేసి ఎక్కువ మోతాదులో పీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్ఎంపీలు తమస్థాయికి మించి వైద్యం అందిస్తున్నారని తెలియడంతో ఆకస్మికంగా తనిఖీలు చేయడం జరిగిందన్నారు. రోగులకు ఎక్కువ డోసులు ఉన్న మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్టు వస్తుందని తెలిపారు. ప్రజలు కూడా ఎంబీబీఎస్ వైద్యుల వద్దే ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపీ వైద్యులపై ఉక్కు పాదం మోపి ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా కొల్లాగుంట చెక్ పోస్టు వద్ద మురళీ నిర్వహిస్తున్న ఆస్పత్రిని సీజ్ చేసి జిల్లా ఉన్నత అధికారులకు ఆయనపై ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పలు వైద్యాధికారులు ఉన్నారు.



బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యానేరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: బాల కార్మికులను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి హేమాచారి అన్నారు . మంగళవారం గంగాధర నెల్లూరు మండలంలో వివిధ రకాల ఫ్యాక్టరీలు, దుకాణాలు, ఇటుక బట్టీలు, గ్రానైట్ ఫ్యాక్టరీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింధూర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు చదువుకునేందుకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని, 18 సంవత్సరాల వరకు పిల్లలు బడిలో ఉండాలని, పెద్దలు పనికి వెళ్లాలని తెలిపారు. మహిళా శిశుసంరక్షణ అధికారి, లాయర్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యాభ్యాసాలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాలను తెలుసుకొని లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రతిమ, మురళి, బాలాజీ పాల్గొన్నారు.



నవరత్నాలతో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నవరత్నాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మొగిలి సచివాలయం పరిధిలోని గాండ్లపల్లి, మొగలిమిట్టూరు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఆధ్వ ర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లా డుతూ ప్రతి పేదవాడు అభివద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పలు సంక్షేమ పథకాలు ప్రారంభించారని, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాని వారిని గుర్తించి వారికి తిరిగి మంజూరు చేసే విధంగా చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టిందన్నా రు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, సింగల్ విండో ఛైర్మన్ దత్తాత్రేయ రెడ్డి, తహశీల్దార్ బెన్ రాజ్, మండల అధికారులు, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ భవన స్థలాన్ని సోషల్ వెల్ఫేర్ ఈఈ శివ ప్రసాద్, డీఈ జయకుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 కోట్ల వ్యయంతో భవనాల నిర్మాణం జరిగేలా మంత్రి నిధులు మంజూరు చేశారని, పనులు త్వరితగతిన ప్రారంభించి సకాలంలో భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సదుం జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ యషిత, గహ సారథుల సదుం మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్న శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కమ్మపల్లె గ్రామంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మంగళవారం పురవీధులలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు చిన్న శేష వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతులను అందజేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. భక్తులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: తహశీల్దార్ ఆఫీస్‌లో రికార్డుల నిర్వహణపై అవగాహనకు ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ గంగాధర నెల్లూరు రెవెన్యూ ఆఫీస్‌లో వారం రోజుల పాటు ఉంటారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి గ్రామంలో నిర్వహించే రికార్డులను పరిశీలించి తహశీల్దార్ ఇన్బనాథన్, డిటి తులసీరామ్, తూగుండ్రం వీఆర్వో శిరీష వద్ద వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ, పోరంబోకు, నంజ, పుంజ, గుట్ట పోరంబోకు భూమిని రికార్డుల్లో ఏవిధంగా గుర్తిస్తామని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ఫైల్స్‌ను ఎలా తయారుచేస్తారు, స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై నివేదికలు తయారు చేసే విధానంపై తెలుసుకున్నారు.



ఉత్సాహంగా ఫైనల్ మ్యాచ్

ప్రజాశక్తి-నగరి: స్థానిక పట్టణంలోని కేవీకే మైదానం వేదికగా రోజాఛారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం ఉత్సాహభరితంగా కొనసాగింది. క్రీడాకారులు తమ బ్యాటింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ చూడ చక్కటి షాట్‌లతో అలరిస్తుండగా.. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే అవుట్ చేయడంతో పాటు పరుగులు తీయకుండా ఉండేలా బౌలర్లు శ్రమించారు. దీంతో ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగింది. అండర్ 14లో గోదావరి, కష్ణా టీంల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా ఒక్క పరుగు తేడాతో గోదావరి టీం విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 25 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కష్ణా జట్టు 29.4 ఓవర్లలో 156 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో 33 పరుగుల తేడాతో గోదావరి జట్టు విజయం సాధించింది. అండర్ 16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా తొలుత బ్యాటింగ్ చేసిన యమునా జట్టు 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గంగ జట్టు 159 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 45 పరుగుల తేడాతో యమున జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు బుధవారం ట్రోఫీలు అందించనున్నట్లు శాప్‌కోచ్ బాబు తెలిపారు.



ఉచిత పశువైద్య శిబిరం



ప్రజాశక్తి-సోమల: మండలంలోని తమ్మినాయుని పల్లి గ్రామంలో సోమల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం వైద్యాధికారిణి చందన ప్రియ ఆధ్వర్యంలో గ్రామంలో 105 పశువులకు పిడుదుల మందు పిచికారి, 32 దూడలకు నట్టల నివారణ మందు, 17 పశువులకు గర్భకోస నివారణ చికిత్సలు అందజేసినట్టు తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ పశు భీమాపై రైతులకు తెలియజేసి పశువులకు భీమా చేసుకోవాలని పూర్తిగా వివరించారు. పాల అధిక దిగుబడికి చేపట్టవలసిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఏహెచ్ అనూష, సహదేవ, మహేష్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పురాణాలను తెలుసుకోవాలి



ప్రజాశక్తి-సోమల: పాఠశాల విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలలోని పాఠ్యాంశాలతో పాటు పురాణ, ఇతిహాసాలను కూడా అవపాసన చేసుకోవాలని గ్రంథాలయ అధికారి రామకృష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన విడిది కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో మంగళవారం ఇంగ్లీషు గ్రామర్, పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర కథలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దాదాపు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై లోకేష్‌ను సస్పెండ్ చేయాలి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఎస్సై లోకేష్‌ను సస్పెండ్ చేయాలని గంగాధర నెల్లూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్ అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని తూర్పు దళితవాడకు చెందిన రామ్మూర్తి అనే దళిత యువకుడిని పోలీస్ స్టేషన్‌లో బంధించి ఆదివారం చిత్రహింసలకు గురిచేసి, లాఠీలతో శరీర భాగాలు కమిలిపోయేలా కొట్టిన వెదురుకుప్పం ఎస్సైపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. మంగళవారం ఆయన తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామ్మూర్తిని పరామర్శించారు. ఒక ఎస్ఐగా ఉన్న ఆయనకు ఈ విధంగా ప్రవర్తించడం తగదన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావత్తం కాకుండా జిల్లా ఎస్పీ దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-సోమల: గ్రామాలలో ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని అంటు వ్యాధులు ప్రబలకుండా గృహాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా, దోమలు, ఇతర వ్యాధికారక జీవులు ప్రబలకుండా చూడాల్సిన అవసరం ఉందని ఏఎన్ఎం గీత అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు అంటువ్యాధులు, ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆమె మహిళలకు వివరించారు. ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రతి ఒక్క గర్భిణి కాన్పు చేయించుకోవాలని, ఆపరేషన్ లేకుండా నార్మల్ డెలివరీ అయ్యేవిధంగా వైద్యుల సూచన మేరకు ఆహార నియమాలను పాటించాలని తెలిపారు. మహిళా సంఘాలు గ్రామాలలో అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, మహిళా సమస్యలపై ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్త, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణ పక్షోత్సవాలు



ఎస్ఆర్ పురం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం, ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆరిమాకులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అతిసార వ్యాధి నియంత్రణ పక్షోత్సవాన్ని వైద్యులు పల్లవి, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, గౌరీ ఆధ్వర్యంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఆర్ పురం, ఆరిమాకుల పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతిసార వ్యాధి ఎలా నివారించుకోవాలి, నీళ్ల విరేచనాలు , 0-5 చంటి పిల్లల తల్లులకు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ ఎలా వాడాలి అనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఓపీ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: అతిసారతో ఏ చిన్నారి కూడా మృతి చెందరాదనే డయేరియా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిపిహెచ్ఎన్ ఓ రేణుక ప్రభ తెలిపారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరి గిన ఆశ నెలవారి సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు అతిసారతో మృతి చెందడాన్ని నివారించడానికి ఐడిసిఎఫ్ పక్షోత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు సంబంధించి సర్వే నిర్వహించా లన్నారు. ఎవరైనా విరోచనాలు అవుతున్నట్లు తెలిపితే వారికి చికిత్సలు అందించాలని ఆమె సూచించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలని వారికి అవగాహన కల్పించారు. యాదమరి వైద్యాధికారిణి సురేఖ, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, పిహెచ్ ఎన్ జయ భారతి, సూపర్‌వైజర్ నిర్మలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమావేశం



ప్రజాశక్తి-పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో గర్భిణులు, బాలింతలు, ఎనీమియా ఉన్నవారిని తీసుకురావాలని తెలిపారు. హై రిస్క్ ఎక్కువ వున్న గర్భిణులను గుర్తించి వారికి స్కానింగ్ చేయించి ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకురావాలని చెప్పారు. అనంతరం డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ, కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ మూర్తి, ఎంపీహెచ్వో శేషాద్రి, హెల్త్ సూపర్ వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతి పరిధిలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం లక్కనపల్లి, గొల్లచీమనపల్లి, అలపల్లి, కంభంపల్లి, పి.సి.గుంట సచివాలయాల వాలంటీర్లను యం.రెడ్డెప్ప అధ్యక్షతన సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివద్ధి పైన నిత్యం ప్రజలకు సేవలు అందించినందుకు వారికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రెడ్డెప్ప తెలిపారు. అనంతరం ప్రజలకు గొప్ప సేవలు అందించిన వాలంటీర్లకు మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప తన సొంత ఖర్చులతో దుస్తులు అందజేశారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఎంపీపీ అధ్యక్షులు మొగసాల రెడ్డప్ప, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, లక్కనపల్లి సర్పంచ్ కష్ణారెడ్డి, గొల్లచీమనపల్లి సర్పంచ్ యూన్సీ పాల్గొన్నారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కాపుమొండి వెంగనపల్లిలో వేరుశనగ లో చిన్న చిన్న రసం పీల్చు పురుగులకు స్థానిక రైతు బి.నిర్మల నీమాస్త్రం అనే మందు తయారు చేసింది. మంగళవారం అదే గ్రామంలో రామకష్ణారెడ్డి వరి పొలాన్ని పరిశీలించగా చిన్న చిన్న రసం పీల్చు పురుగులను గుర్తించి నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీఏ హనుమంతు, సీఆర్పీ మురళి రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య



ప్రజాశక్తి-వి.కోట: వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. వివరాలు.. మండల పరిధిలోని చింతమాకులపల్లి పంచాయతీ కోనేరు గొల్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, కష్ణప్పల మధ్య ఆస్తి విషయమై తగాధ నడుస్తుంది. కష్ణప్ప కుమారుడు బాలాజీ (27) వరసకు అన్న అయిన చంద్రశేఖర్ కుమారుడు సుదర్శన్(25)లు వరసకు అన్నదమ్ములు. వీరికి వారసత్వంగా వచ్చిన మూడెకరాల పొలం సమానంగా పంచుకుని ఎవరికి వారు పాస్ పుస్తకాలు చేసుకొని సాగు చేసుకుంటున్నారు. ఇటీవల జరిగిన భూ రీ సర్వేలో 30 సెంట్లు స్థలం తమ పేరిట రికార్డు ఉందని దానిని తమకు అప్పగించాలని చంద్రశేఖర్ కుమారుడు సుదర్శన్.. కష్ణప్ప, బాలాజీలను కోరాడు. తమ ఆధీనంలో ఉన్న భూమిని ఎలా ఇవ్వమంటారంటూ అందుకు అంగీకరించకుండా పరస్పరం గొడవ పడుతున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడగా గ్రామ పెద్దలు వారించి పంచాయతీ చేస్తామని గడివిచ్చారు. తమ సాగులోని పొలంలో చెట్లకు సుదర్శన్ చెత్త మందు కొట్టడంతో అవి ఎండిపోయాయని ఆగ్రహించిన బాలాజీ ఉదయం గొడవపడుతూ కత్తితో దాడి చేసి సుదర్శన్‌ను హత మార్చాడు. హతడు సుదర్శన్‌కు, హత్య చేసిన బాలాజీకి ఇద్దరికీ వివాహం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరుకు తరలించి, నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో కలెక్టర్ పర్యటన



ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మొదటగా శెట్టిపల్లి హైస్కూల్‌లోని మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సర్పంచ్ గ్రామపంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి అతనికి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా తాడేపల్లి గ్రామంలో స్వయం సహాయక మహిళ గ్రూప్ సభ్యులు నిర్వహిస్తున్న మిల్లెట్ యూనిట్‌ను పరిశీలించి మహిళలతో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం ద్వారా తప్పక కల్పిస్తానని వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా మండల అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తీర్చాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

పొరపాట్లు చేయకండి



ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేస్తున్న సిబ్బంది మద్యం స్టాకు, అమ్మకాల నగదు విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయరాదని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి, మద్యం దుఖాణాల్లో విధులు నిర్వహించే సూపర్‌వైజర్లను ఆదేశించారు. మంగళవారం కార్వేటినగరం మండలంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొంతమంది సిబ్బంది పొరపాట్లు చేసి వారి భవిష్యత్తు పాడు చేసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలలో విడి మద్యం, కల్తీ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. ఆన్లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించడం జరిగిందన్నారు.తనిఖీలలో మద్యం షాపు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.